కథా నిలయం
4569
శ్రీకాకుళం




# చంద్రమండల యాత్ర

అది నల్లమల కొండలలో ఒక నిర్జన అటవీ ప్రాంతం. దట్టంగా పెరిగిన చెట్లు గాలికి చేసే చప్పుడులూ, పక్షులూ, జంతువులూ మొదలైన వాటితో ఆ ప్రదేశం బీభత్సంగా ఉంటుంది. అటువంటి నిర్జన ప్రదేశంలో ప్రముఖ భూతత్వ శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త అయినటువంటి డాక్టర్ మోహన్ ఆయన పరివారమూ గుడారం వేశారు. డాక్టర్ మోహన్‌కి, ఖగోళ శాస్త్రమన్నా, భూతత్వ శాస్త్రమన్నా, చిన్నతనం నుంచీ మిక్కిలి అభిరుచి. ఖగోళ శాస్త్రంలో ఆయన డాక్టరేట్ బిరుదు సంపాదించాడు. ఆయన లాంటి అభిరుచులే కలిగి ఉండి, ఎల్లప్పుడూ ఆయనకు తోడునీడగా ఉండేటటువంటి డాక్టర్ ప్రసాద్ కూడా ఆయన వెంట ఉన్నాడు. ఆయన వైద్య శాస్త్ర నిపుణుడు. వారు చదివిన చదువులు వేరు అయినప్పటికీ వారి అభిరుచులూ, అభిలాషలూ ఒకే కోవకు చెందినవి. ఇద్దరి మధ్య ఏవిధమైన అరమరిక లేదు.

ఖగోళ శాస్త్ర విజ్ఞానంలో పాశ్చాత్య దేశాలు సాధిస్తున్న అభివృద్ధిని చూసి, మోహన్ భారత దేశంకూడా ఎప్పుడు ఆ విధంగా తయారవుతుందా అని బాధపడేవాడు. అతని తండ్రి చనిపోయి మూడేళ్ళు అయింది. మోహన్ ఇప్పుడు స్వతంత్రుడు, అందుచేత, స్వంతంగా ఖగోళ పరిశోధనశాఖ నెలకొల్పాలనే ఉద్దేశంతో స్వతహాగా ఆంధ్రుడననే అభిమానం కలవాడవడంచేత, తగిన ప్రదేశంకొరకై ఆంధ్రదేశం పర్యటిస్తున్నాడు తన పరివారంతో తన వ్యాపారం, తను లేకపోయినా, నిర్విఘ్నంగా జరిగే ఏర్పాట్లుచేసి, ఈపనికి పూనుకొన్నాడు ఆయన.

నల్లమల కొండలలో వారు విడిదిచేసిన ప్రాంతం. ఖగోళ వేధశాలా నిర్మాణానికి అనువుగా కనిపించింది. అక్కడి వాతావరణం కూడా, చుట్టూ దట్టంగా చెట్లూ, చామలు ఉండటంచేత, మిగిలిన ప్రదేశాలపై ఉండేదానికంటే స్వచ్ఛంగా ఉంది. ఆకారణంగా, నక్షత్రాలను గ్రహాలను పరిశీలించడం సులభమవుతుంది. ఆ కొండ శిఖరం మేఘాలకంటే ఎత్తుగా ఉండడంచేత మేఘాల అడ్డంకులు చాలా అరుదుగా వస్తాయి.

అదీగాక ఆ ప్రాంతంలో మరొక ప్రత్యేకతకూడా ఉంది. అక్కడికి కొద్దిమైళ్ళ దూరంలో చాలా పెద్ద ఇనప గనులు ఉండడానికి అవకాశం ఉన్నట్లు మోహన్ కనుగొన్నాడు. అవి ఎంత లోతున ఉన్నదీ, వాటి నాణ్యత ఎటువంటిదీ, మొదలైన విషయాలు, ఖగోళ పరిశోధనశాలా నిర్మాణం పూర్తి అయ్యాక పరిశోధించడానికి తలపెట్టాడు ఆయన.



ఖగోళ పరిశోధన శాలా నిర్మాణానికి రెండేళ్లు పట్టింది, ప్రధానమంత్రిచే ప్రారంభోత్సవం జరిగింది. డాక్టర్ మోహన్, తన పరిశోధన శాల ప్రపంచంలో దేనికీ తీసిపోదనీ, ప్రభుత్వ సహకారముంటే, ప్రపంచంలోని అన్ని పరిశోధన శాలలలోనూ, తలమానికంగా చేయగలనని నుడివాడు. ప్రధానమంత్రి తమ చేతనైన సహాయం చేయడానికి సర్వదా సిద్ధమేనని చెప్పారు.

డాక్టర్ మోహన్, తనజీవిత కాలంలో, అంతర్గ్రహ యాత్ర చేయాలని ఉవ్విళ్ళూరుతుండేవారు. కాని అది నెరవేరే విషయంకాదని ఆయన అనుకుంటూండేవారు. ఏమంటే దానికి బ్రహ్మాండమైన రాకెట్లను నిర్మించాలి. ఆ రాకెట్లను నడపడానికి, అమితమైన ఇంధనాన్ని సమకూర్చాలి. ఇవి ఏ ఒక్క వ్యక్తి మూలంగా జరిగేవికావు. ప్రస్తుత పరిస్థితులలో మన భారతదేశం కూడా ఆపనికి పూనుకోలేనటువంటి స్థితిలో ఉంది. కాని మోహన్ కలలు నిజమయ్యే రోజు సమీపంలోనే ఉందనే విషయం ఎవరు ఊహించగలరు?

పరిశోధనాశాల చాలా చైతన్యవంతముగా పనిచేస్తోంది అందుచేత మోహన్, తాను కొత్తగా కనుగొన్న ఇనుప గనులవైపు దృష్టి మళ్ళించాడు. ఆ రోజు గనులున్న ప్రదేశంలో డైనమైట్‌ను పెట్టి ప్రేల్చడానికి సిద్ధంగా ఉన్నారు. మోహన్, ప్రసాద్ దూరాన్నుంచి, బైనాక్యులర్సులో దృశ్యాన్ని పరికిస్తున్నారు.

ఢాం... అని డైనమైట్ ప్రేలింది. చిచ్చుబుడ్డిలో మల్లే రాళ్ళు పైకి ఎగురుతున్నాయి. ఇంతలో మోహన్, ప్రసాద్, తమ కళ్ళను తామే నమ్మలేని దృశ్యాన్ని చూశారు. ఆశ్చర్యంతో వాళ్ళు

చైతన్యరహితులైపోయారు. కొంతసేపటికి తెప్పరిల్లి ఒకరినొకరు ప్రశ్నార్థకంగా చూసుకొన్నారు.

వాళ్ళను అంతగా విభ్రాంతులను చేసిన దృశ్యం ఏమిటంటే, సరిగా డైనమైట్‌ను ఉంచిన ప్రదేశానికి, చుట్టూ ఉన్న కొద్ది ప్రదేశాన్నుంచి ఎగిరిన రాళ్ళు, క్రిందకు రాకుండా రాకెట్లవలె ఆకాశంలోకి నిలువుగా ఎగిరిపోయాయి. అవింత సంగతిని గురించి పరిశీలించడానికి వాళ్లిద్దరూ హుటాహుటిని అక్కడికి పయనమయ్యారు.

డైనమైట్‌ను స్వతహాగా ఉంచినచోట, గోయి ఏర్పడి, దానిలో చుట్టూరా సుమారు ఒక చదరపు గజము మేరకు తెల్లటి, గట్టి సదార్థము ఏర్పడింది. దానిమీద కొన్ని కొండరాళ్ళు చెదురుగా పడివున్నాయి. మోహన్ ఆ ప్రదేశం వేడిగా ఉందో, ఏమో అని చూసే ఉద్దేశంతో తన కుడికాలు ఇవతలపెట్టి, ఎడమకాలును ఆ పదార్థంపై పెట్టాడు. పెట్టీ పెట్టగానే మోహన్ ఒక వెర్రికేక వేశాడు. ప్రసాద్ ఉలిక్కిపడి "ఏమిటి? కాలు కాలిందా?" అంటూ దగ్గరకు వచ్చాడు. మోహన్ తన ఎడమకాలును ఇవతలకు తీసి దానిమీద కాలు పెట్టగానే నా ఎడమకాలు అతి తేలికగాను, కుడికాలుకు ఎవరో బలంగా లాగివేస్తున్నట్లు గానూ అనిపించింది. ఆ లాగుడికి నాకాలు ఊడిపోతుందేమో ననిపించి అప్రయత్నంగా కేకవేశాను" అన్నాడు.

"చిత్రంగా ఉందే! నేను రెండు కాళ్లూ పెట్టి చూస్తాను" అంటూ ప్రసాద్ ఆ ప్రదేశంపై రెండు కాళ్ళూ పెట్టి నుంచున్నాడు. వెంటనే ఆనందావేశంతో "నావొళ్ళు ఎంతో తేలికగా ఉంది. గాలిలోకి తేలిపోతానేమో అనిపిస్తోంది" అంటూ సంతోషంతో ఎగిరి గంతు వేశాడు. గంతువేశాడో లేదో, ప్రసాద్ నిలువుగా గాలిలోకి ఎగరడం ప్రారంభించాడు. వెంటనే మోహన్ ఒక్క ఎగురు ఎగిరి అతని రెండుకాళ్లూ పట్టుకొని క్రిందకు లాగాడు. దానితో ఇద్దరూ కలిసి కొంతభాగం తెల్లటి పదార్థంపైనా, కొంత ప్రక్క నేలమీదా పడ్డారు. ఇద్దరూ ఒక్కసారే బాధకలిగినట్లు అరిచారు. నేలమీద పడినవారి దేహభాగానికి ఎవరో లాగివేస్తున్నట్లు బాధ కలిగింది. ఇద్దరూ దొర్లుకుంటూ పూర్తిగా ఇవతలి నేలమీదకు వచ్చేశారు.

కొంత సేపటివరకూ ఈ చిత్రానుభూతిలో వారు నిశ్చేష్టులై అలాగే ఉండిపోయారు. ఇంతలో ఉన్నట్టుండి మోహన్ "ప్రసాద్ ఈ రహస్యాన్ని నేను ఛేధించాను" అని కేక పెట్టాడు. ప్రసాద్ ప్రశ్నార్థకంగా చూశాడు.

మోహన్ "ఇక్కడి నేలలో ఉన్న పదార్థం ఏదో విచిత్రమైంది. దానిమీద డైనమైట్‌ను ప్రేల్చినప్పుడు జనించిన ఉష్ణంవలన. ఇక్కడి పదార్థం డైనమైట్‌తో కాని, లేక అంతర్గతంగా కాని రసాయనిక సంయోగం చెందింది. ఆవిధంగా ఏర్పడ్డ పదార్థం భూమ్యాకర్షణశక్తిని నిరోధించేదిగా తయారయింది. ఈ పదార్థానికి "గ్రావైట్" అని పేరు పెట్టుదాం అన్నాడు.

ప్రసాద్ "అయితే ఈ పదార్థం ఆకాశంలోకి ఎందుకు ఎగిరిపోలేదు? అని అడిగాడు.

మోహన్ "ఈపదార్థం ఏర్పడ్డది కొద్దిప్రదేశంలో మాత్రమే, పైగా డైనమైట్ ప్రేలినప్పుడు ఏర్పడిన గోయి గోడలు దీనిని నొక్కివేస్తున్నాయి" అన్నాడు.

ప్రసాద్"అయితే ఆ గోడల మట్టిని తీసి వేస్తే ఇది పైకి ఎగిరిపోతుందా?" అని అడిగాడు.

మోహన్ "ఎగరదు ఎందుకు అంటే అది నిశ్చలస్థితిలో ఉంది. దానికి గమనం కలిగితే ఎగురుతుంది. ఉదాహరణకు ఇంతకుముందు నీవు గ్రావైట్‌మీద నిలబడినప్పుడు నీవు పైకి ఎగరలేదు.

ఎప్పుడైతే పైకి గంతువేశావో నీకు చలనంకలిగి అప్పుడే పైకి ఎగరబోయావు. పదార్థ విజ్ఞానశాస్త్ర సూత్రాల ప్రకారం ప్రతి పదార్థానికి నిశ్చలస్థితి ఉంటుంది. దీనినే ఇనెర్షియా (Inertia) అంటారు. అటువంటి పదార్థానికి గమనం కలిగించితే అవరోధాలు లేనంతవరకూ అది గమనం కలిగించిన దిశలో ప్రయాణం చేస్తూనే ఉంటుంది. నీవు మొదట నిలబడినపుడు నీ దేహం నిశ్చల స్థితిలో ఉంది. నీవు ఎగిరినపుడు నీ దేహానికి గమనం కలిగింది. నేను నిన్ను పట్టుకొని నీ దేహానికి అవరోధం కలిగించకపోయినట్లయితే నీవు ఆకాశంలోకి నిటారుగా వెళ్లేవాడివే. సాధారణ పరిస్థితులలో మన గమనానికి భూమ్యాకర్షణ శక్తి అవరోధం కల్పిస్తుంది. దాన్ని అధిగమించగలుగుతే అనంతవిశ్వంలో గ్రహాంతరయానం సులభమవుతుంది" అన్నాడు. ప్రసాద్ "అయితే ఈ గ్రావైట్‌ను ఉపయోగించి మనం గ్రహాంతరయానం ఎందుకు చేయగూడదు?" అన్నాడు. మోహన్ "నిజమే ప్రసాద్. నాకు ఇంకా తట్టనేలేదు. మన కలలన్నీ నిజమవుతాయి" అని ఆనందంలో మిత్రుని ఆలింగనం చేసుకొన్నాడు.

మోహన్, ప్రసాద్ గ్రావైటును గురించి అనేక పరిశోధనలనుచేసి, దాని సహాయంతో అంతర్గ్రహయాత్ర సాధ్యమేనన్న నిశ్చయానికి వచ్చారు. తమ ప్రయత్నాన్ని స్థూలంగా ప్రభుత్వానికి చెప్పి, తమకు వలసిన విధంగా ప్రభుత్వాన్ని సహాయం చేయమని అర్థించారు. ప్రభుత్వం అందుకు సమ్మతించింది.

గ్రావైటును తగినంత ఉత్పత్తిచేసి, దానితో 20 అడుగుల వ్యాసంగల ఒక పెద్ద గోళాన్ని నిర్మించారు వారు. అది గాలి తాకిడికి గమనం కలిగి ఎగిరిపోకుండా, గట్టిగా త్రాళ్ళతో నేలకు కట్టివేశారు. ఆ గోళానికి చుట్టూ పదహారు కిటికీలు అమర్చారు. ఆ కిటికీల తలుపులు గ్రావైటుతో చేయబడ్డాయి. వాటి లోపలి భాగం, పగలని, గట్టి గాజుతో చేయబడింది. ఈ గోళంపై ఆకర్షణశక్తి ఏమీ ఉండదు. కాని గ్రావైట్ తలుపులను తెరచినట్లయితే లోపల గాజు ఉన్న కారణంచేత ఆ ప్రదేశంపై ఆకర్షణశక్తి ఉంటుంది. గోళానికి కట్టిన త్రాళ్ళను ఊడదీస్తే, గోళం తెరచిన కిటికీ దిశగా పయనిస్తుందన్నమాట. ఆ విధంగా అవసరమైన కిటికీలను తెరుచుకొని, గోళాన్ని ఏదిశలో పడితే, ఆ దిశలో ప్రయాణం చేసేటట్లు చేయవచ్చును. ఇవి గాక, గ్రావైట్‌ను, కొన్ని రసాయనిక పదార్థాలతో సంయోగపరచి, పారదర్శకముగా ఉండే పదార్థమును తయారు చేశారు. ఈ పదార్థంతో అన్ని దిశలా చూడగలిగే విధంగా ఎనిమిది కిటికీలు అమర్చారు. ఈ పదార్థంపైగూడా ఆకర్షణ శక్తి ఉండదు. ఇంతేగాక, గోళంలోపలికి వెళ్ళడానికి, బయటకు రావడానికి ఒక తలుపు అమర్చబడింది. అవసరమైన పరికరాలన్నీ అమర్చబడినాయి.

గోళంలో మోహన్, ప్రసాద్ వెళ్ళడానికి నిశ్చయించారు. వారితోబాటు లైకా టామీ అనే రెండు కుక్కలను కూడా తీసుకు వెళ్ళడానికి నిశ్చయించారు. తమకు ఆరు నెలలకు సరిపడే భోజన పదార్థాలను సమకూర్చుకొన్నారు. వారం రోజులలో ఈ గోళం చంద్రమండలానికి బయలుదేరుతుంది.

ఆరోజు ఆదివారం. నాటి ఉదయం ఎనిమిది గంటలకు, గోళం ప్రయాణం మొదలిడుతుంది. నిర్జన అటవీ ప్రాంతం జనంతో క్రిక్కిరిసిపోయింది. ప్రధానమంత్రి ప్రారంభోత్సవం చేయడానికి వచ్చారు.

మోహన్, ప్రసాద్ అందరివద్దా సెలవుపుచ్చుకొన్నారు. ప్రధానమంత్రి వారిద్దరినీ ఆలింగనం చేసుకొన్నారు. అందరికీ ఆనందంతో బాటు ఆవేదన కూడా ఉంది. వారిద్దరు బ్రహ్మచారులే జీవితాన్ని అనుభవించనివారు. దేశానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చినవారు. అటువంటివారు ఈ లోకాన్ని వదలివెళ్లిపోతుతున్నారు తిరిగి వస్తారో రారో ! రాకపోవడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందరి

ముఖాల్లోనూ, ముఖ్యంగా వారి బంధువుల ముఖాల్లో ఆవేదన ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. సమయం గడుస్తున్న కొద్దీ వారి ఆవేదన అంతకంతకు ఎక్కువవుతోంది. ఉదయం 7.30 అయింది. వారిద్దరూ గోళంలోకి వెళ్ళారు ఆఖరిసారి అందరి సెలవు తీసుకున్నారు. తలుపు మూతపడింది. లోపల కుర్చీలలో కూర్చుని నడుములకు, కుర్చీలకు పటకాలు బిగించారు.

సమయం 7-45 అయింది. గోళానికి కట్టిన ఒక్కొక త్రాటిని విప్పుకున్నారు. 8 గంటలు అయింది. ప్రధానమంత్రి చివరిత్రాటిని విప్పారు. అంతా చూస్తుండగా గోళం తారాజువ్వల్లే ఆకాశంలోకి లేచింది. పదిహేను నిమిషాలైనా గడవకముందే అనంతాకాశంలో అదృశ్యమయింది.

గోళం కట్లనుండి విడిపడి ప్రయాణం మొదలిడగానే ఒక్కసారి కుదిపినట్లయింది మిత్రులిద్దరకూ. భూమ్యాకర్షణశక్తి పైకిపోయినకొలది సెకనుకు 32 అడుగుల చొప్పున తగ్గుతుంది. అందుచేత గోళం బయలుదేరినప్పటినుంచీ ప్రతి సెకనుకూ 32 అడుగులచొ॥న వేగాన్ని హెచ్చిస్తూ ప్రయాణం సాగిస్తోంది. ఆ దృశ్యాన్నే వింతగా చూస్తున్నారు మిత్రులిద్దరూ. చూస్తుండగానే బల్ల పరుపుగా ఉన్న భూమి వంపుగా గోళంగా మారింది నీలిసముద్రం. మధ్య పచ్చనినేల, నల్లని కొండలు పైన తెల్లని మేఘాలు అంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. చంద్రుని కళవలె భూకళకూడా కనిపిస్తోంది. భూమిపై పగటి రాత్రి ప్రదేశాలు, వారు ఒకే కంటితో చూడగలుగుతున్నారు. అంతసేపూ గోళంలో ఉన్న యంత్రాలు, బజ్...మని శబ్దాన్ని వినిపిస్తూ వచ్చాయి. ఆ శబ్దం అంతకంతకు తగ్గుతూ చివరికి ఆగిపోయింది.

మోహన్: "మన గోళం భూమిపైన ఉండే గాలి పొరలలో ప్రయాణం చేయడం వల్ల ఆ శబ్దం ఏర్పడింది. ఇప్పుడు అది, గాలి పొరలను ఇంచుమించు పూర్తిగా దాటివేసిందన్న మాట. అంటే సుమారు ఆరు వందల మైళ్ళ ఎత్తున ఉన్నాం మనం' అని దూరాన్ని కొలిచే యంత్రం చూసి "మన శాస్త్రజ్ఞుల లెక్కలు సరియైనవే. ఇప్పుడు యంత్రం 670 మైళ్ళు చూపుతోంది చూడు. ఇంత వేగంతో మరే ఇతర పదార్థమైనా ప్రయాణిస్తే అది గాలి రాపిడికి మండిపోయేదే. కాని మన పరిశోధనల మూలంగా తయారయిన ఈ గోళం అంతటి రాపిడినీ తట్టుకోగలిగింది. పైగా ఈ పదార్థంలో ఉండే ప్రత్యేకత మూలంగా ఉష్ణం లోనికి ప్రసరించదు. లోనిది బయటకిపోదు. ప్రస్తుతం గోళం ఉపరితలం, రాళ్ళను సైతం కరగించేటంతటి వేడిమి కలదై ఉంటుంది" అన్నాడు.

ప్రసాద్: "అన్నీ బాగానే ఉన్నాయి. కాని ఒక్క సందేహం మిగిలింది. గోళం భూమి మీద నిశ్చల స్థితిలో ఉంది గదా. అటువంటప్పుడు కట్లు విప్పగానే అది గాలిలోకి ఎలా ఎగిరింది?" అన్నాడు.

మోహన్: "నీ ప్రశ్న అమాయకంగా ఉంది. గోళంపై భూమ్యాకర్షణశక్తి ప్రభావం లేదు. అందుచేత దానికి ఏ మాత్రపు చలనం కలిగినా, సెకనుకు 32 అడుగుల చొప్పున వేగాన్ని పెంచుకుంటూ వెళ్ళిపోతుంది. గాలివీయడంవలన కలిగే చలనం చాలు అది పైకి ఎగిరిపోవడానికి" అన్నాడు.

ప్రసాద్: "కాస్త కాఫీ తాగుదాం" అని ప్రక్కనున్న ప్లాస్కు అందుకొని కప్పులో కాఫీ పోయబోయాడు. కానీ కాఫీ కప్పులో పడక, తిన్నగా గోళం మధ్యగా పోయింది. కొంత ప్రసాద్ బట్టలమీద ఒలికింది. ప్రసాద్ ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాడు.

మోహన్‌కు నవ్వు ఆగలేదు. తనివితీరా నవ్వాక "ఈ గోళంలో, దానిలోపలి భాగం మామూలు పదార్థాలతో చేయడం వలన, ఈ గోళపు ఆకర్షణ శక్తి గోళం మధ్యలో ఉంటుంది. అందుచేత సహజంగా

ప్రతి వస్తువు అటువైపు ఆకర్షించబడుతుంది. మన దేహానికికూడా, గోళానికి ఉన్నంత కాకపోయినా చెప్పుకోతగ్గంత ఆకర్షణ శక్తి ఉంది. అందుకే కొంత కాఫీ నీమీద ఒలికింది. ఎక్కువ భాగం గోళం మధ్యకి పోయింది. తాడు పుచ్చుకొని, గోళం మధ్యగా కప్పును తీసుకు వెళ్ళు. కాఫీ అందులో పడుతుంది. అప్పుడు జాగ్రత్తగా కప్పును మూసి కాఫీ తీసుకురా.'' అని సలహా ఇచ్చాడు.

మోహన్ చెప్పినట్లు చేయబోయాడు ప్రసాద్ కప్పును గోళం మధ్యకు తీసుకు వెళ్ళడంలో అతని చేయి త్రాటిని వదిలింది. అంతే, అతను నిలుచున్నవాడు నిలుచున్నట్లే గోళం మధ్యకి పోయి తేలడం మొదలుపెట్టాడు. అతని చేయి పుచ్చుకొని తనవైపు లాగాడు ప్రసాద్. ఎల్లాగయితే వారు ఇద్దరూ కాఫీ వగైరాలు పూర్తిచేశారు.

వాళ్ళు కిటికీలోనుంచి భూమివైపు చూశారు. భూమిబాగా చిన్నదయిపోయింది. ఎటు చూసినా నక్షత్రాలు విపరీతమైన కాంతితో, ఎలక్ట్రిక్ దీపాల్లా మెరుస్తున్నాయి. వాటి వెనక నల్లటి ఆకాశం ఒకవిధమైన భయం కొల్పుతూవుంది.

“మోహన్ ! మన భూమిమీద గాలి ఉండడమువలన, అది సూర్యకాంతిలోని నీలికిరణములను చెదరగొట్టి, ఆకాశం నీలంగా ఉన్నట్లు భ్రమ కల్పిస్తుంది. కాని ఈ విశ్వాంతరాళంలో గాలి లేని కారణంవలన ఆకాశం నల్లగా కన్పిస్తోంది” అని విశదపరిచాడు.

మధ్యాహ్నం భోజనం అయినాక వారు భూమికి రేడియో సందేశం ఇచ్చారు. తాము సుఖంగానే ఉన్నామనీ, తమ ప్రయాణం అనుకున్నట్లే జరుగుతోందనీ.

ప్రసాద్ “అయితే ఇప్పటికి మనం సగం రోజు మాత్రమే ప్రయాణం చేశాము. ఇంకా మూడున్నర రోజులు ప్రయాణం చేయాలన్న మాట” అన్నాడు.

మోహన్ “అవును అప్పుడే మొహం మొత్తిందా”? అన్నాడు. ప్రసాద్” అదికాదు. రాత్రింబవళ్ళ తేడా తెలియరాక పోవడంతో. కాలగమనం ఆగిపోయిందేమోననిపిస్తోంది” అన్నాడు.

ఆ విధంగా వారి ప్రయాణం ఆరోజు, మరునాడుకూడా గడిచింది. మూడవరోజు ప్రొద్దున ఏ కారణంచేతనో లైకా కుక్క మరణించింది. మిత్రులిద్దరూ దాని మృతికి చాలా విచారించారు. దాని మృతదేహాన్ని విశ్వాంతరాళంలో వదిలివేయడానికి నిశ్చయించారు.

ప్రసాద్ “మనం దీనిని బయటకు పారవేయడానికి తలుపు తెరిస్తే లోనిగాలి బయటకు పోతుందేమో!” అన్నాడు. మోహన్ ‘మరేమీ ప్రమాదం లేదు. గోళంయొక్క ఆకర్షణశక్తి మూలంగా గాలిలోపలనే ఉంటుంది” అన్నాడు.

ప్రసాద్ లైకాను తలుపుతీసి బయటకు వదిలివేశాడు. బయట గాలికూడా గడ్డకట్టుకుపోయేటంత చల్లగా ఉంది.

లోపల కూర్చున్న ప్రసాద్‌కు, కిటికీలో నుంచి ఒక వింత దృశ్యం కనిపించింది. అమాంతంగా మోహన్ భుజంతట్టి “చూడు చూడు మనలైకా మన గోళం వెంబడే వస్తోంది” అన్నాడు.

మోహన్ “అవును. ఈ కిటికీద్వారా కుక్క ఆకర్షించబడింది. ఈ కిటికీకి ఉన్న గ్రావైట్ తలుపులను

మూసివేస్తే అది విశ్వాంతరాళంలోకి అల్లావెళ్ళిపోతూ ఉంటుంది. ఈ చలిలో అది ఎన్ని వేల సంవత్సరాలైనా అల్లాగే ఉంటుంది. ఏదైనా గ్రహంకాని, ఇటువస్తే ఇది అటు ఆకర్షించబడి దానిపైపడిపోతుంది. లేకుంటే అలా అనంతయాత్ర చేస్తూనే ఉంటుంది.'' అన్నాడు.

ఇంతలో భయంకరమైన విపత్తు ఒకటి తారసిల్లబోయింది. కిటికీలోంచి చూస్తున్న వాళ్ళకు, అనతిదూరంలో పెద్ద ఉల్క ఒకటి బ్రహ్మాండమైన వేగంతో, గోళంవైపువస్తూ కన్పించింది. నిముషంలో అది వచ్చి గోళాన్ని గ్రుద్దివేస్తుంది. అంతటితో ఆ గోళం చరిత్ర, మిత్రులిద్దరి చరిత్ర పరిసమాప్తి అవుతుంది. ప్రమాదం కనిపెట్టిన మోహన్ చంద్రునివైపు వుండే నాలుగు కిటీకీలను త్వరితంగా తెరచివేశాడు. వెంటనే గోళం వేగాన్ని పుంజుకొంది. ఉల్క ఇంచుమించు గోళాన్ని దూసుకుంటూ వెళ్ళిపోయింది. అది తనతోపాటు లైకాదేహాన్ని తీసుకుపోయింది.

ఆ విధంగా మూడురోజులు గడిచాయి. ఇంక ఒక్కరోజు మాత్రమే చంద్రమండలయాత్రకి మిగిలి ఉంది. ఇప్పుడే గోళాన్ని జాగ్రత్తగా అదుపులో పెట్టుకోవాలి. మధ్యాహ్నం రెండు గంటలకు గోళం నిరాకర్షణ ప్రదేశాన్ని చేరింది. ఆ ప్రదేశంలో గోళంపై, భూమి, చంద్రుల ఆకర్షణ విరుద్ధ దిశలలో సమానంగా ఉంటుంది. (ఈ దూరం చంద్రుడికీ, భూమికీ మధ్యగల దూరంలో సుమారుగా 2,37000మైళ్ళు) భూమి నుంచి ఆరింట అయిదు వంతుల వద్ద, చంద్రుని నుంచి ఆరింట ఒక వంతు వద్ద ఉంటుంది. ఇందుకు కారణం చంద్రుని ఆకర్షణ భూమియొక్క ఆకర్షణ కంటె సుమారు ఆరు రెట్లు తక్కువ అవడమే) ఆ ప్రదేశం చేరగానే మోహన్, గ్రావైట్ తలుపులు గల కిటికీల నన్నిటినీ మూసివేశాడు. అందుచే గోళం చంద్రుని చుట్టూ దీర్ఘ అండవృత్తాలు చేయడం మొదలుపెట్టింది. అక్కడి నుంచి టెలిస్కోప్ ద్వారా వారు చంద్రమండలాన్ని పరిశీలించడం మొదలుపెట్టారు.

ఆ పరిశోధనలు అయ్యాక మళ్లీ, చంద్రుని వైపు ఉండే కిటికీని తెరిచాడు మోహన్. గోళం వేగాన్ని పుంజుకుంటూ ప్రయణం సాగిస్తోంది చంద్రునివైపు, ఆ విధంగా మరి ఒకరోజు గడిచింది. వారు చంద్రమండలం చేరడానికి ఇంక పదహారు గంటలు మాత్రమే ఉంది.

ఆరోజు గురువారం. అంటే వారు బయలుదేరి నాలుగురోజులు గడిచిందన్నమాట. ఆ రోజు ఉదయం సుమారు పది గంటలకు వారుచంద్రునిపై దిగగలరు. వారు గోళంలోనుంచి చంద్రుని పరిశీలిస్తున్నారు. మోహన్ ఉత్సాహంతో 'అదిగో అది టైకో పర్వతం, అవి అపెనైన్ పర్వత శ్రేణులు, అది ఎరాటో స్థీన్సు వలయపర్వతం, అది ఆశాసముద్రం అని పేరిడబడిన చంద్రమైదానం'' అని చూపిస్తున్నాడు. చంద్రునిపై ఎత్తయిన కొండలు, గుండ్రంగా, కోట గోడలల్లే ఉన్నట్లు వలయపర్వతాలు. వాటి మధ్య నిటారుగా ఉన్నట్టి కొండలు. అంతా వింతగా కనిపిస్తోంది. ఒక ప్రక్క చంద్రుని రాత్రి. మరియొక ప్రక్క చంద్రుని పగలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారు గ్రహాంతర యానదుస్తులు ధరించి, ప్రాణవాయువును జాగ్రత్త పరుచుకున్నారు. కుక్కకు కూడా అన్నీ అమర్చారు. గోళపువేగాన్ని క్రమక్రమంగా తగ్గిస్తూ జాగ్రత్తగా నడుపుతున్నారు. చంద్రుడిపై దిగడానికి, అనువైన ప్రదేశం కొరకు వారు పరికిస్తున్నారు. అంత ఎత్తునుంచి వారికి చంద్రునిపై చెట్లు, చేమలు ఏవైనా వున్నాయో లేవో ఏమీ కనిపించడం లేదు.

వారుచంద్రునిపై సుమారు 200మైళ్ళ ఎత్తున ఉన్నారు. గోళం నెమ్మదిగా దిగుతోంది. గోళం 50మైళ్ళ ఎత్తుకు దిగింది. చంద్రుని ఉపరితలం కొంచెం కొంచెం స్పష్టంగా కనిపిస్తోంది. అది పరిశీలిస్తున్న

సమయంలో ఉన్నట్టుండి, గోళం లోని శబ్దగ్రహణయంత్రం, బజ్.... మని శబ్దం చేయడం మొదలు పెట్టింది.

"అరె... చంద్రునిపై గాలి ఉందే! ఏబది మైళ్ళ ఎత్తువరకే ఉండడము చేత మన భూశాస్త్రజ్ఞులు కనిపెట్టలేక పోయి ఉండాలన్న మాట." అని ఆశ్చర్యాతిరేకంతో అన్నాడు మోహన్. ఈ ఆనందంలో గోళం యొక్క కిటికీలను అదుపులో పెట్టలేదనే విషయాన్ని వారు విస్మరించారు. గోళం మహావేగంతో చంద్రునిపై పడుతోంది. ఎదురుగావున్న కొండను ఢీకొనేటట్లు. కిటికీలను సరిదిద్దే అవకాశం కూడా లేదు. సిద్ధంగా ఉన్న పారాచ్యూట్లను తగిలించుకొని, కుక్కతో సహా ఇద్దరూ దూకేశారు. గోళంలో నుంచి వెంటనే ఎవరో వీపులను బలంగా లాగినట్లనిపించింది. తలెత్తి చూస్తే పారాచ్యూట్లు తెరచుకొన్నాయి. అంటే చంద్రునిపై గాలి ఉందని నిర్ధారణ అయింది. వారు చూస్తుండగానే గోళం టైకో పర్వతాన్ని ఢీకొంది. వాళ్ళు నెమ్మదిగా గోళానికి సుమారు రెండుమైళ్ళ దూరంలో దిగారు.

గోళంగతి ఏమైనదో అనివారిద్దరూ. భయంగా దాని దగ్గరకు పరిగెత్తారు. వాళ్ళ కాళ్ళు నేలమీద ఆనటము లేదు. తేలిపోతున్నట్లున్నాయి. ఇక్కడ గంతువేస్తే అక్కడికి వెళ్ళిపడుతున్నారు. ఎంతదూరమైనా ఇట్టే పరిగెత్తవచ్చుననిపించింది. అందుకు కారణం చంద్రుని ఆకర్షణశక్తి భూమియొక్క దానికంటే ఆరురెట్లు తక్కువ అవడమే. రెండు మైళ్ళదూరం వెళ్ళడానికి వారికి పదినిముషాలు కూడా పట్టలేదు.

గోళం తునాతునకలై ఉంది. గ్రానైటు ముక్కలు అనేకం అంతరిక్షంలోకి ఎగిరిపోయాయి. భోజనసామగ్రి, దుస్తులు రేడియో ప్రసారయంత్రం చెల్లాచెదరుగా పడిఉన్నాయి. రేడియో ప్రసారక యంత్రం చెడిపోయింది. సుమారు ఒక గంట అవస్థపడి దానిని బాగుచేశారు వారిద్దరూ ప్రమాదం గురించిభూమికి వార్త పంపించారు. కాని ఎంత ప్రయత్నించినా భూమినుంచి సమాధానం రాలేదు.

మోహన్ నిస్పృహతో "రేడియో తరంగాలను గూర్చిన మన ఊహలు తప్పు అయి ఉండవచ్చు. లేదా మన యంత్రం మనకు తెలియని విధంగా చెడిపోయి ఉండవచ్చు. ఇంక మనకూ భూమికి ఏ విధమైన సంబంధం లేనట్లే. ఈ నిర్జనలోకంలో మనకు మృత్యువు తప్పదు." అన్నాడు. ప్రసాద్ "అవసరం కలిగినప్పుడే మనిషి బుద్ధి వికసిస్తుంది. మనకు ఏదో ఒక ఉపాయం తట్టకపోతుందా" అని ఊరడించాడు ప్రసాద్.

మోహన్ "ముందు మనం మన సామగ్రిని ఎక్కడైనా జాగ్రత్త చేసుకోవాలి పద. ఏ గుహ అయినా కనిపిస్తుందేమో" అన్నాడు.

అనతి దూరంలోనే ఆ టైకో పర్వతంలో ఒక గుహ కన్పించింది. వారు అందులోకి వెళ్ళిచూశారు. వాళ్ళకి అమితాశ్చర్య ఆనందాలు కలిగాయి. ఆ గుహలోపల వెలుగును వెదజల్లే మొక్కలు ఉన్నాయి. వాటి వెలుగుతో గుహ ప్రకాశవంతంగా ఉంది.

మోహన్ "చూడు. ఈ గుహ మనకు చాలా అనువుగా ఉంది. చంద్రమండలంలో, అల్పతరగతి వృక్షజాలం ఉంది, ఇంకా ఎటువంటి జీవం ఉందో ముందు మన సామానును ఇక్కడికి చేర్చుకోవాలి!" అన్నాడు.

వారిద్దరూ వాళ్ళ వస్తుసామగ్రి దగ్గరకు వెళ్ళారు. ఆ సామగ్రి అంతనీ, ఏ విధంగా గుహకు చేర్చడమా అనిపించింది వారికి.

ప్రసాద్ "ఇంకా కొన్ని గ్రావైటు ముక్కలు నిశ్చల స్థితిలో ఉన్నాయి కదా. వాటి సహాయంతో మనం ఈ సామగ్రి అంతటినీ సులువుగా తీసుకొని పోవచ్చు" అన్నాడు.

ఆ ప్రకారంవారు, గ్రావైట్‌ను ఉపయోగించి అతిత్వరలో సామానును గుహకుచేర్చారు వారు. టామీ ముగ్గురూ భోజనాలు పూర్తిచేశారు. హాయిగా నిద్రపోయి లేచారు. చంద్రమండలాన్ని పరిశోధించడానికి సిద్ధమయ్యారు. ఆ గుహ గుర్తుగా వుండేటట్లు, ఒక త్రాటికి ఒక గ్రావైట్ ముక్కనుకట్టి, దానికి భారతపతాక కట్టారు. అది గాలిలో నిటారుగా నిలిచి ఎగిరింది, మొదటిసారి చంద్రమండల యాత్ర చేసిన కీర్తి భారతదేశానికి దక్కింది.

గుహను వదలి బయటకు వెళ్ళేముందు వారు చంద్రమండల వాతావరణాన్ని పరిశోధించారు. అందులో ప్రాణవాయువు ఉన్నప్పటికీ, తక్కువ పరిమాణంలో ఉన్నట్లు స్పష్టమయింది. నెమ్మదిగా చంద్రమండల వాసానికి అలవడ్డ తర్వాత ఆ గాలిని పీల్చుకొని బ్రతకవచ్చని నిర్ధారణ అయింది.

మిత్రులిద్దరూ, టామీతో బయటికి వచ్చారు. కొద్దిపాటి తినుబండారాలు, నీటితో, ముగ్గురు మహదానందంతో చకచక వెళ్ళిపోతున్నారు. దారిలో అనేక కొండలు, గుట్టలూ, లోయలూ అన్నీ వస్తున్నాయి. చిత్రమేమంటే ఎక్కడా జీవచిహ్నం కాని, నీటి చిహ్నం కాని, కన్పడలేదు. అంతా మృతభూమి లాగా ఉంది. ఆ విధంగా 100మైళ్ళ పైగా ప్రయాణం చేశారే గాని వారు ఎంతదూరం వచ్చింది గమనించలేదు. ఆ సమయంలో వారు అపెనైన్ పర్వతశ్రేణులలో ఒక శిఖరంపై ఉన్నారు. ఈ శిఖరాగ్రం నుంచి వారు నలుదెసల పరికించి చూశారు. ఇంతలో మోహన్ ముఖం వివర్ణమయింది.

అతను "కొంప ములిగింది ప్రసాద్, కాళరాత్రి ముంచుకువస్తోంది. అటు చూడు. జీమూతంలాగా ఎల్లా వస్తోందో. మనం వదలిన గుహ ఈ కాళరాత్రిలో కలిసి పోయింది. ఈ భయంకర రాత్రి 15 రోజులకు కాని అంతమవదు. ఈ పదిహేను రోజులలో మనం మన గుహను జేరుకోలేం బహుశా ఈ లోపల మనం ఆకలితో దప్పికతో మరణించవచ్చు. అంతకంటె ముఖ్యం ముందు ఇక్కడ నుండి మనం పగటి ప్రదేశాలకు పారిపోవాలి. రాత్రి ఈ దిశగానే తరుముకు వస్తోంది" అన్నాడు.

వారు ముగ్గురూ గ్రావైటు సహాయంతో పరుగు ప్రారంభించారు. పగటి ప్రదేశాలవైపు అలా ఎంతదూరం పరిగెత్తారో వారికే తెలియదు. వారు బాగా అలసిపోయారు. దగ్గరలో ఉన్న ఒక గుహలో విశ్రాంతి తీసుకోడానికి కూర్చున్నారు. వారికి తెలియకుండానే ముగ్గురూ నిద్రాదేవి ఒడిలో తలదాచుకున్నారు.

ఆ విధంగా ఎంతసేపు నిద్రపోయారో ఏమో ఉన్నట్లుండి టామీ మొరుగుతూ గుహలోపలికి వెళ్ళుతోంది. టామీ మొరుగుతూనే ఉంది. దాని వెనకాల వారిద్దరూ గుహలోకి వెళ్ళారు. ఆ గుహ ఏవిధమైన గదులు లేకుండా ఉంది. లోనికి వెళ్తున్నకొద్దీ వెల్తురు ఎక్కువయింది. భూమిమీద వృక్షజాలానికీ, అక్కడ ఉన్న దానికీ ఎక్కడా పోలికలేదు. గుహపై భాగంలో సుమారు ప్రతి 50 గజాలకూ, సుమారు రెండు అడుగుల వ్యాసం కలరంధ్రాలు ఉన్నాయి. వాటిలోంచి సూర్యరశ్మి లోనికి వస్తోంది. ఆ విధంగా ఇంకా కొంత దూరం వెళ్ళేసరికి గుహ అంతమయి పెద్దలోయ వచ్చింది. ఆ బ్రహ్మాండమైన లోయచుట్టూ

సుమారు నాలుగు మైళ్ళ ఎత్తువున్న వర్తులాకారపు కొండలు ఉన్నాయి. ఆ లోయలో బ్రహ్మాండమైన ఒక చంద్రమండల పట్టణం కానవచ్చింది. ఆ కొండ చరియల్లో కూడా అనేక గృహాలు ఉన్నాయి. అన్నీ కూడా కొండరాతితో కట్టినవే. ఆ చంద్రమండలమానవ నిర్మిత నగరం కన్నుల పండువగా ఉంది. ఆ లోయలో అనేకములైన వృక్షాలు ఉన్నాయి. వింత వింత పుష్పాలలో వింత వింత సౌరభాన్ని వెదజల్లుతూ, ఆ దృశ్యాలని తిలకిస్తూ వారు ఆశ్చర్య సాగరమగ్నులై నిలబడి పోయారు. తిరిగి టామీ మొరుగుతో వారికి స్పృహ వచ్చింది. వారికి సుమారు 12 అడుగుల దూరంలో ముగ్గురు చంద్రమండల మానవులు నిలబడి ఉన్నారు. వారు నాలుగు అడుగుల ఎత్తుమాత్రమే ఉన్నారు. తల, కాళ్ళు, చేతులు పెద్దవిగా ఉన్నాయి. పొట్ట చిన్నదిగా ఉంది. తలమీద జుట్టు చాలా ఒత్తుగా ఉంది. కళ్లు, ముక్కుకూడా పెద్దవిగా ఉన్నాయి. కళ్ళు, ముక్కు తల మనకంటె ఎక్కువ వంపుగా వుండి మానవులకంటె ఎక్కువ భాగాన్ని చూసేవిగా ఉన్నాయి. వారు వింత దుస్తులను, చెప్పులను ధరించారు. వారిలో మధ్యవ్యక్తి ఒక ప్రధాన ఉద్యోగివలె ఉన్నాడు. మిగతా ఇద్దరూ అతని అంగరక్షకులవలె, చేతులలో ఆయుధములు వంటివి ధరించి, ప్రక్కన నిలబడినారు.

టామీ మొరుగుడు ఎక్కువ అయింది మోహన్ దానిని అదుపుచేసి చేయి పైకి ఎత్తాడు. మరొక చేయి పిస్టల్‌మీద ఉంది. మధ్యవక్తి కూడా చేయి పైక్తి ఎత్తాడు. మరియొక చేతితో అతని జేబులో ఉన్న ఏదో యంత్రాన్ని సవరించాడు. వెంటనే మిత్రులిద్దరకూ "ఎవరు మీరు? మేము మీకు మిత్రులమే. భయంవలదు." అని ఆ వ్యక్తి చెప్పినట్లు భావం కలిగింది. ఆవిచిత్రానుభూతికి ఇద్దరూ ఆశ్చర్యపోయి ఒకరినొకరు చూసుకున్నారు. ఇంతలో మళ్లీ వారికి "ఆశ్చర్యం అవసరంలేదు. మా యంత్ర సహాయంతో భాష తెలియకపోయినా ఒకరి భావాలు మరిఒకరు అర్థంచేసుకోవచ్చు. భాష ఏదైనా అందరి భావాలు ఒకే విధంగా ఉంటాయి. అవి మస్తిష్కంలో అందరికీ ఒకే విధమైన విద్యుత్తరంగాలను కల్పిస్తాయి. ఆ విద్యుత్తరంగాలను మా యంత్రం గ్రహించి మా భాషలో అనువదించి మెదడుకి అందజేస్తుంది అదే విధంగా మా భావాలను మీకు అందజేస్తుంది." అని అన్నట్లు భావన కలిగింది.

రహస్యం అవగాహన చేసుకున్న మిత్రులిరువురూ తాము వచ్చినపనీ, జరిగిన విషయములూ అన్నీ విశదపరచారు.

ఆవ్యక్తి తన పేరు "చంసుమా" అని తను చంద్రమండల శాంతి సైన్యాధికారిననీ వారిని తమ అతిధులుగా ఆహ్వానిస్తున్నామనీ చెప్పాడు.

చంసుమా ఆహ్వానాన్ని అంగీకరించి వారు చంద్రమండల అతిధులుగా వెళ్ళారు. చంద్రమండల ప్రధాని "సుంసుమా" వారికి ఘనమైన స్వాగతం ఇచ్చాడు. వారు అనేక విషయాలు చర్చించారు. తత్ఫలితంగా ఈ క్రింది విషయాలు తెలియవచ్చాయి.

చంద్రమండలంలో శీతోష్ణాలు అత్యధికంగా ఉన్నాయి కనుక వారు లోతైన లోయలలో పట్టణాలు నిర్మించుకున్నారు. అటువంటివి కొద్దిమాత్రమే ఉన్నాయి. అదిగాక మానవ నిర్మిత గృహాలను, నేలను దొలిచికూడా వారు నగరములు నిర్మించారు. సూర్యరశ్మిని అద్దముల ద్వారా గుహలలోనికి, నేలలోనికి రప్పించుతారు. చంద్రమండలంలోని మొక్కలు సూర్యరశ్మిని గ్రహించి రాత్రులందు, ఉష్ణమును ప్రసరిస్తాయి. చంద్రమండలం పైకి అచైతన్యంగా కనిపించినా, అది ఎంతో చైతన్యవంతమై అభివృద్ధి చెందింది. చంద్రమండలంలో పురపెద్దలచే ఎన్నుకొనబడే ప్రభుత్వం ఉంది. అక్కడ యుద్ధం బెడదలేదు.

అక్కడ అందరూ శాంతికాముకులు. వైజ్ఞానిక అభివృద్ధి వారి లక్ష్యం.

మోహన్ సుంసుమాను తాము తిరిగి భూమికి వెళ్ళే మార్గం ఏమైనా ఉందా? అని అడిగాడు. సుంసుమా "మరిచాను. అంగారక గ్రహవాసులు భూమిమీద దిగాలని ప్రయత్నిస్తున్నారు. వారు కూడా శాస్త్రవిజ్ఞానంలో ఎంతో ముందంజ వేశారు. వారు మా చంద్రమండలాన్ని అంతరగ్రహ స్థావరంగా ఏర్పరచుకొన్నారు. వారికి మాకు మైత్రి ఉంది. అందుచేత మా సంయుక్త కృషిలో బాగా అభివృద్ధి చెందిన ఎగిరే పళ్ళెములను నిర్మించాము. వాటిలో మామండలం వారు అంగారక వాసులు కూడా భూమిమీద అనేక పర్యాయములు ఎగిరాము. కాని భూమిమీద ఎక్కడ చూసినా విధ్వంసకరచర్యలు కన్పిస్తున్నాయి. అటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు ప్రేల్చబడుతున్నాయి. నాశనకాండ తాండవిస్తోంది. వైజ్ఞానిక కృషి వక్రమార్గం పట్టింది. అందుచేత వారితో మేము, మైత్రి ప్రయత్నాలు జరిపితే, అవి మా మనుగడకే భంగమేమోననే భయంతో మేము ఇంకా భూమిమీద దిగలేదు. మా లోకాలు శాంతి ప్రయోజనాల కోసం, విజ్ఞానాభివృద్ధి గావించాయి. కాని మీ లోకంలో జరిగే విధ్వంసక కృషికి మేము తల ఒగ్గవలసిందే. అంగారక వాసులు తిరిగి మా మండలానికి నాలుగు నెలలలో వస్తారు. వారుసమ్మతిస్తే మీరు వారి ఎగిరే పళ్ళెములలో భూమికి వెళ్ళవచ్చు. ఈ లోపల భూవాసులకు ఈ విషయమై వార్తపంపించండి. వారు మైత్రికి సిద్ధంగా ఉంటే అందరూ వెళ్ళవచ్చు. అంగారక వాసులు వచ్చేవరకూ మీరు మా లోకం మందే పర్యటించండి." అన్నాడు.

మోహన్ "మా రేడియో ప్రసారకయంత్రం చెడిపోయింది. దానిని మీ నిపుణులతో సరిచేయించండి." అని అన్నాడు. సుంసుమా అందుకు ఒప్పుకున్నాడు.

మోహన్ పంపిన వార్తలను విని భూలోకం ఉత్సాహంతో అట్టుడికినట్లు ఉడికిపోయింది. ప్రపంచంలోని అన్నిదేశాలూ తమ విబేధాలను మరచి, త్రిలోకవాసులకు అఖండ స్వాతగమివ్వడానికి ఏకగ్రీవంగా ఆమోదించి, సమైక్య కృషి ప్రారంభించాయి.

నాలుగు నెలలపాటు మిత్రులిరువురూ చంద్రమండలం యావత్తూ పర్యటించారు. అక్కడి మొక్కలను, జంతువులను, స్త్రీపురుషులను, వింతలూ, విశేషాలూ అన్ని పరిశీలించారు.

అనుకున్నట్లుగానే అంగారకవాసులు చంద్రమండలంపై విడిశారు. త్రిలోక వాసులకు రాయబారాలు జరిగాయి. చంద్రమండలవాసులు, చంసుమా, సుంసుమాలతో కలసి నలుగురు, అంగారక వాసులు నలుగురు, భూవాసులు ఇద్దరు మొత్తం పదిమంది, ఎగిరే పళ్ళెములో భూమిని జేరడానికి నిశ్చయించారు. వీరంతా, పదిరోజుల అనంతరం భూమికి రాబోతున్నట్లు భూమికి వార్తను పంపారు. టామీని చంద్రమండలానికి కానుకగా అర్పించారు.

ఆరోజు శనివారం అదే రోజు మధ్యాహ్నం మూడుగంటలకి, హైద్రాబాద్ నగరంలో ఎగిరే పళ్ళెం దిగింది. ప్రపంచం నలుమూలల నుంచీ, కోటాను కోట్ల జనం త్రిలోకవాసులకు అఖండ స్వాగతం ఇచ్చారు. విశ్వాంతరాళయాత్రా గౌరవం ప్రథమంగా ఆంధ్రదేశానికి, తద్వారా భారతదేశానికి దక్కింది.

**చుక్కాని, 15-6-1959** ✪